


# ఆరోగ్య జ్యోతి

వైద్య ఆరోగ్య విజ్ఞాన తెలుగు దినపత్రిక




సంపుటి : 01 సంచిక : 01 ఆదిలాబాద్ ఎడిటర్: కె నరేష్ కుమార్ పేజీలు : 04, వెల రూ. 5రూ/ శనివారం, జూన్ 07, 2025

## రిమ్స్‌లో సమస్యలెన్నో?

**- పనిచేయని లిఫ్టులు**

**- అరకొరగా సిబ్బంది**

**- సక్రమంగా అందని సేవలు**



అరసవల్లి,(ఆరోగ్యజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్–జీజీహెచ్)లో సేవలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ప్రతివార్డులోనూ సమస్యలు దర్శనమిస్తూనే ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి నిత్యం వందలాది మంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. కానీ సక్రమంగా సేవలు అందక.. ఆస్పత్రులో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా లిఫ్టులు పనిచేయకపోవడంతో రోగులపాట్లు వర్ణణాతీతం. తరచూ లిఫ్టులు మొరాయిస్తున్నాయి. ఇటీవల లిఫ్ట్ మధ్యలో నిలిచిపోగా.. అందులో ఆరుగురు రోగులు, వారి బంధువులు నానా అవస్థలు పడి.. బయటకు వచ్చారు. అలాగే గైనిక్‌వార్డుకు అనుబంధంగా ఉన్న లిఫ్ట్ తరచూ మొరాయిస్తూనే ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో గర్భిణీలను పరీక్షిస్తారు. ల్యాబ్‌రూమ్ కూడా కిందనే ఉంది. సర్జరీ, లేదా ప్రసవం కోసం గర్భిణులను మూడో ఫ్లోర్‌కు తరలించేటప్పుడు లిఫ్ట్ పనిచేయకపోతే నరకయాతన పడుతున్నారు. అలాగే చిన్నపిల్లల విభాగానికి వెళ్లే మార్గంలో సీలింగ్ పెచ్చులూడి భయానకంగా తయారైంది. అక్కడే ఆర్‌ఎంవో చాంబర్ ఉన్నా.. కనీసం మరమ్మతులు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### - 930 బెడ్స్... ముగ్గురే ఎలక్ట్రీషియన్లు...

గతంలో 450 బెడ్స్ ఉన్నప్పుడు ఆస్పత్రి అవసరాలకు సంబంధించి 12మంది ఎలక్ట్రీషియన్లు ఉండేవారు. నేడు 930 పడకలుగా అప్‌గ్రేడ్ అయినా.. కేవలం ముగ్గురు



ఎలక్ట్రీషియన్లు మాత్రమే ఉండడం గమనార్హం. కరోనా సమయంలో ఆస్పతిలో 15మంది ఎలక్ట్రీషియన్లు, ఐదుగురు లిఫ్టు ఆపరేటర్లు, ప్లంబర్లను నియమించారు. ఇప్పుడు కూడా అదే సంఖ్యలో సిబ్బంది అవసరం. కానీ లేరు. జనరేటర్లు, సబ్‌స్టేషన్, పవర్ ప్యానల్స్ మెయింటెనెన్స్ కోసం 12 మంది సిబ్బంది ఉండాలి. దీనికి సంబంధించి ఇంజినీరింగ్ శాఖ.. ఎవరినీ నియమించలేదు. ఎలక్ట్రీషియన్లే లిఫ్టు ఆపరేటర్లుగా తాత్కాలికంగా వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రిలో తరచూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కేబుల్స్ కాలిపోతున్నాయి. ముగ్గురితోనే ఎలా నెట్టుకొస్తున్నారో... ఆ దేవుడికే తెలియాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని రోగులు ప్రశ్నిస్తున్నారు.

### - ఫిర్యాదు పెట్టెలు ఎక్కడా?

ఆస్పతిలో రోగులకు, సక్రమంగా వైద్యసేవలు అందకపోయినా.. ఇతర ఇబ్బందులు ఎదురైనా ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి. సేవల్లో లోపాలు ఎదురైతే.. రోగులు ఫిర్యాదు చేసేలా.. ప్రత్యేక పెట్టెలను ఏర్పాటు చేస్తామని ఆస్పత్రి అధికారులు గతంలో ప్రకటించారు. కానీ, ఎక్కడా ఫిర్యాదు పెట్టెలు కానరావడం లేదు. ఫిర్యాదు పెట్టెలతోపాటు ఆస్పత్రిలో ఆర్‌ఎంవో, సూపరింటెండెంట్ ఫోన్ నెంబర్లను అన్ని విభాగాల వద్ద కనిపించేలా ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

### - అభివృద్ధి కమిటీ సమావేశం ఎప్పుడో...?

కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయినా.. ఇంతవరకూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) సమావేశం నిర్వహించలేదు. ఆస్పత్రిలో సమస్యలు, అవసరాలు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన, బాధ్యత ఉండాలంటే.. హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిమ్స్‌లో సమస్యల పరిష్కారంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు

## సర్కారు దవాఖానాల్లో అవయవ మార్పిడుల పెంపు?

**- ట్రాన్స్‌ప్లాంటేషన్లపై సర్కార్ నిర్ణయం**

**- మూడు పెద్దాస్పత్రుల్లో ప్రత్యేక విభాగాలు**

**- నిమ్స్, గాంధీ, ఉస్మానియాల్లో ఏర్పాటు**




హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి): ప్రభుత్వ పెద్దాస్పత్రుల్లో అవయవ మార్పిడులను పెంచాలని సర్కారు భావిస్తోంది. ఇందుకోసం సర్కారు దవాఖానాల్లో ప్రత్యేక అవయవ మార్పిడి విభాగ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానాల్లో వీటిని ఏర్పాటు చేయనుంది. తొలుత ప్రత్యేక అవయవ మార్పిడి సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేసి, విభాగాధిపతిని నియమించనున్నారు. ఆ తర్వాత వాటిలో కనీసం ఐదారు పోస్టుగ్రాడ్యుయేట్ సీట్ల కోసం జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ)కి దరఖా స్తు చేయనున్నారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ల సంఖ్య పెరగనుంది. సర్కారు దవాఖానాల్లో అవయవ మార్పిడి ఎలా పెంచాలన్న అంశంపై ఇటీవలే రాష్ట్ర వైద్య అధికారు ల బృందం గుజరాత్‌లోని గట్స్ (గుజరాత్ యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస)ను సందర్శించింది. అక్కడ అవయవ మార్పిడి, అలైడ్ సైన్సెస్, పీజీ సీట్లపై అధ్యయనం చేసింది. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించింది. రాష్ట్రంలోనూ స్పెషల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖకు సిఫారసు చేసింది. ఈ మేరకు ఆ మూడు పెద్దాస్పత్రుల్లో అవయవ మార్పిడి విభాగాలను ఏర్పాటు చేయనున్నారు.

### - అనుకున్న స్థాయిలో జరగని మార్పిడులు

ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడుల సంఖ్య అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఒక్క నిమ్స్‌లో మాత్రమే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు ఏటా 125 నుంచి 135 వరకు జరుగుతున్నాయి. మిగతా ఆస్పత్రుల్లో నామమాత్రంగానే ఈ సంఖ్య ఉంటోంది. అదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో అవయవ మార్పిడులు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో క్షతగాత్రులై ఆస్పత్రుల్లో చేరి.. చికిత్స చేసినా కోలుకోని కేసుల సంఖ్య కూడా సర్కారు దవాఖానాల్లోనే ఎక్కువగా ఉంటోంది. ఇటువంటి కేసులు ప్రైవేటుకు వస్తే.. ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబ సభ్యులతో చర్చించి, వారి అనుమతితో బ్రెయిన్ డెడ్ డిక్లేర్ చేస్తున్నారు. అనంతరం అవయవాలు తీసి అవసరమైన వారికి మార్పిడి చేస్తున్నారు. బ్రెయిన్ డెడ్ డ్లికేర్ చేసిన కేసుల్లో ఒక అవయవం 'జీవన్‌దాన్'కు వెళితే.. మిగతా అవయవాలు సంబంధిత ఆస్పత్రులకే చెందుతున్నాయి. ఆ ఆస్పత్రి తరఫున అవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి కేటాయిస్తున్నారు. వాస్తవానికి ప్ర మాద కేసులు తొలుత ప్రభుత్వ ఆస్పత్రులకే ఎక్కువగా వస్తుంటాయని, ఆ తర్వాత ప్రైవేటుకు





వెళ్తుంటాయని ఓ వైద్యాధికారి తెలిపారు. సర్కారీ ఆస్పత్రుల్లో కూడా బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ చేస్తే.. అటువంటి కేసులతో వచ్చే ఆవయవాలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి దక్కుతాయని నిపుణులు చెబుతున్నారు.

### - ప్రైవేటులో రూ.10-15 లక్షలు..

అవయవ మార్పిడి చేయించుకోవాలంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. ఉదాహరణకు కిడ్నీ మార్పిడి లాంటి వాటికైతే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వాటి స్థాయిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతోంది. అదే నిమ్స్‌లో అయితే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తున్నారు. ప్రైవేటులో ఖర్చు తట్టుకోలేని మధ్యతరగతి, నిరుపేదలు సర్కారీ దవాఖానాల్లోనే జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం జీవన్‌దాన్‌లో అవయవాల కోసం మొత్తం 16,569 మంది రిజిస్టర్ చేసుకున్నారు. అందులో ఒక్క కిడ్నీ కోసమే 8,044 మంది, కాలేయం కోసం 7,521 మంది రిజిస్టర్ చేసుకోగా, మిగతా వాటిలో గుండె, ఊపిరితిత్తులు, నేత్ర, కోమ్లం (పాన్‌క్రియాస) కోసం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలో 2013 నుంచి నేటి వరకు మొత్తం 5,323 అవయవ మార్పిడులు జరిగాయి.

### - ఏమిటీ గట్స్

గుజరాత్ యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్ (గట్స్) కేవలం అవయవమార్పిడి కోసమే ఏర్పాటైన సంస్థ. ప్రపంచంలోనే తొలిసారి అవయవ మార్పిడి, అలైడ్ సైన్సెసకు సంబంధించి ఏర్పాటైంది. ఇంకా చెప్పాలంటే నెఫ్రాలజీలో వినూత్నమైన పరిశోధనలు, వైద్యవిద్య, పరిశోధనల సమాహారమే ఈ గట్స్. ప్రధానంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెసలో అయా రకాల కోర్సులను ఈ యూనివర్సిటీ ఆఫర్ చేస్తోంది.

## సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయవద్దు





**వర్షాకాలం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**

**సిబ్బంది సమయపాలన పాటించాలి**

**సక్రమంగా వీధిలో నిర్వహించాలి**

**పారిశుద్ధం పై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

**విధుల్లో నిర్లక్ష్యం వైశ్య చర్యలు తప్పవు**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సరైన సమయానికి తెర్చాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, (ఆరోగ్య జ్యోతి): వర్షాకాలం ప్రారంభమవుతుందని వ్యాధులు రాకుండా ఇప్పటినుంచి పూర్తిస్థాయి జాగ్రత్తలు వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. శు క్రవారం రోజు కలెక్టరేట్ సమావేశం మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా అంటే అడవుల జిల్లా అని వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు అవసరమున్న మందులు ఇప్పుడే సరఫరా చేయాలని తెలిపారు. వైద్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిబ్బంది సరైన సమయానికి వెళ్లాలని తెలిపారు. వీధిలో నిర్లక్ష్యం వహించిన వారికి శాఖా పరమైన చర్యలు తప్పవు అన్నారు. సబ్ సెంటర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశా కార్యకర్తల వద్ద సీజనులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు.సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడంతోపాటు నివారణ చర్యలు, ముందస్తు ప్రణాళిక రూపొందించవలసిన అవసరం ఉందన్నారు.ప్రస్తుత వాతావరణం పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలకు, ప్రతి ఒక్కరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రచారం నిర్వహించి, వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా జిల్లాలోనీ ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో ముందస్తు సమావేశాలు నిర్వహించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు., మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, విషజ్వరాల పై పూర్తి అవగాహన తీసుకోవలసిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీలు, పట్టణస్థాయిలో మున్సిపల్ వార్డులలో విద్యాసంస్థలలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యే రీతిలో ప్రచారం నిర్వహించాలని, అందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, విద్యాశాఖ, మెప్మా, స్వయం సహాయక బృందాలు, తదితర సాధనాల ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు,ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆసుపత్రుల్లో అన్ని వసతులు కల్పించాలని, ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, వైద్య సేవలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.పాఠశాలలు జూన్ 12 న పున: ప్రారంభం అవుతున్నందున్న ప్రతీ పాఠశాలలో , హాస్టల్, స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలు వాటర్ శాంపుల్స్ ల్యాబ్ కి పంపించి నీటి తీరు ఎలా ఉందో రిపోర్ట్ తీసుకోవాలన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించి చికెన్ షాప్, ఖాళీ ప్లాట్స్, డ్రెయినేజీ, లలో, ఎక్కడెక్కడ చెత్త ఉన్న చోట పరిశుభ్రత పాటించాలని, సంబంధిత యజమానులకు ముందుగా తెలిపి పరిశుభ్రంగా ఉంచాలని, లేనియెడల ఫైన్ వేయడం జరుగుతుందని మున్సిపాలిటీ సిబ్బంది అవగాహన కల్పించాలని , ఈ వర్షాకాలం లో సీజనల్ వ్యాదులు రాకుండా ముఖ్యంగా హైరిస్క్ గ్రామాలలో ప్రత్యేక శ్రద్ధవహించాలను ఆదేశించారు.మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, తదితర వ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. శానిటేషన్ జవాన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మున్సిపాలిటీ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.అలాగే ఇంట్లో స్టోరేజ్ వాటర్ ఎక్కువరోజులు ఉన్న వాటిని తొలగించాలని , ఈగలు,దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.గతం లో కొన్ని హై రిస్క్ ప్రాంతాలలో ఎక్కువ కేసులు వచ్చాయని ఈ ఏడాది వాటి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలనిఅన్నారు.ఈ సమావేశంలోడాక్టర్ నరేందర్ రాథోడ్ జిల్లావైద్యశాఖ అధికారి, డాక్టర్ మనోహర్ అదనపు వైద్యాధికారి(ఐటిడిఎ), డాక్టర్ సాధన డిప్యూటీ డిఎంహెచ్ఓ, డాక్టర్ వైసీ శ్రీనివాస్ డిస్టిక్ ఇమినేషన్ ఆఫీసర్, డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ జిల్లా మలేరియా అధికారి, జితేందర్ రెడ్డి జెడ్పి సీఈవో, రవీందర్ రాథోడ్ పి డి ఆర్ డి ఎ, మరియు అన్ని శాఖధిపతులు, అన్ని మండలాల మెడికల్ ఆఫీసర్లు, మండల పరిషత్ ఆఫీసర్లు, మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# జిల్లా ఆసుపత్రుల్లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డులు

## అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పూర్తయిన మాక్ డ్రిల్





భువనగిరి(ఆరోగ్యజ్యోతి): కొత్త వేరియంట్లతో మరోమారు విజృంభిస్తున్న కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమైంది. నాలుగేళ్ల క్రితం ఉన్న తీవ్రత ఇప్పుడు లేనప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కొత్త ఒమిక్రాన్, ఎన్‌బీ 1.8.1, ఎల్ ఎఫ్.7 నూ తన వేరియంట్లతో ప్రభావితం చూపుతున్న కొవిడ్‌పై వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఆసుపత్రులను, వైద్యులను సంసిద్ధం చేస్తోంది. ఈమేరకు ఈ నెల ఒకటో తేదీన ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కరోనాతో ఆసుపత్రులకు వచ్చే బాధితులకు అందించాల్సిన వైద్య చికిత్సలు, వైద్యు లు,సిబ్బంది తీసుకోవాలసిన జాగ్రత్తలు మందులు, పీపీఈ, టెస్టింగ్ తదితర కిట్లు, అవసరమైతే వ్యాక్సిన్ వైద్య చికిత్సలు, గత అనుభవాలు, రికార్డుల అధారంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లాకేంద్రాల్లోని మూడు భోధనాసుపత్రుల్లో, బీబీనగర్ ఎయిమ్స్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ డయగ్నోస్టిక్ హబ్‌లతోపాటు బీబీనగర్ ఎయిమ్స్‌లో ఆర్టీపీసీఆర్ పరీక్షలను చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని, ఏర్పాట్లు తదితర అంశాలన్నింటినీ బహిర్గతం చేయకూడదని జిల్లా అధికారులను వైద్య ఆరోగ్య, కుటుంబ,డీఎంఈ శాఖల ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

### జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని..

దేశవ్యాప్తంగా సోమవారం నాటికి 3,961 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 32 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో మాత్రం కేవలం మూడు పాజిటివ్ కేసులు వెలుగు చూడగా ఇద్దరు మృతిచెందారు. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలోనే అధిక కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఇప్పటికిప్పుడు మన రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో కొవిడ్ ప్రభావం ఏమీలేదని, ప్రజలు ఎవరూ భయపడవద్దని, కానీ జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# క్యాన్సర్‌తో పోరాడి.. కిరీటాన్ని గెలుచుకుని





చిన్నప్పుడు ఏదైనా చిన్న దెబ్బతగిలితేనే ఎంతో హైరానా పడిపోతారు అందరూ. కానీ క్యాన్సర్ అంటే ఏంటో సరిగా తెలియని వయసులోనే దాని బారిన పడి పోరాడి గెలిచి నేడు ప్రపంచ సుందరిగా నిలిచారు ఓపల్ సుచాత షుంగ్‌సిరి. క్యాన్సర్‌తో తనలా ఎవరు ఇబ్బంది పడకూడదని 'ఓపల్ ఫర్ హర్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ప్రారంభించారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు ఈ థాయ్‌లాండ్ భామ. ఈ ప్రాజెక్ట్ గురించి పలు సందర్భాల్లో ఆమె పంచుకున్న సంగతులు..నాకు పదహారవ ఏటనే రొమ్ములో కణితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలిసినప్పుడు ఎంతో బాధపడ్డా, భయపడ్డా. నాకిక భవిష్యతే లేదని నిరాశ చెందా. కానీ భయంలో నుంచి నాలో ధైర్యం పుట్టుకొచ్చింది. దానితో క్యాన్సర్‌ను జయించా. అయితే ఆ పరిస్థితుల్లో నా కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం నాకెంతో అండగా నిలబడింది. మరి నాలా ఇలాంటి అండ లేని వారి పరిస్థితి ఏంటనే ఆలోచనే 'ఓపల్ ఫర్ హర్' స్థాపనకు పునాది అయింది.

### నాలా అండ లేని వారి కోసం

క్యాన్సర్ సంక్లిష్ట సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను తెలిసిన వారితో పంచుకున్నాను. నేను చెప్పిన ఆ అనుభవాలు తమకు స్ఫూర్తినిచ్చిందని, తామూ క్యాన్సర్‌ను జయించామని కొందరు చెప్పారు. అప్పుడే క్యాన్సర్ రోగులకు అవగాహనతో పాటు మనోధైరాన్ని అందించాలని అర్థమయింది. నాలానే క్యాన్సర్‌ను జయించిన వారి జీవిత కథలు చెప్పి మరికొందరికి జీవితం మీద ఆశ కలిగించాలని నిర్ణయించుకున్నా. ఆలోచన అయితే ఉంది కానీ దానిని సరైన వేదిక లేదు. 'ఓపల్ ఫర్ హర్' స్థాపనతో ఆ వేదిక దొరికింది.

### నా సంపాదన కూడా..

'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్ట్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, దానిని ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకత తెలియజేశా. క్యాన్సర్‌ను జయించిన వారితో పాడ్‌కాస్టలు, వైద్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంతో మందిలో ఆత్మస్థైర్యం నింపడం ప్రారంభించా. అయితే ఆ తరువాత నాకో భయంకరమైన చేదు నిజం తెలిసింది. అదేంటంటే చాలా మందికి ఆస్పత్రులకు వెళ్లేందుకు డబ్బులు లేవని. దాంతో అలాంటి వారి కోసం నిధుల సేకరించడం మొదలుపెట్టా. నా సంపాదన కూడా నిరుపేద మహిళల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేశా. ఆపై ఆస్పత్రులు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, లాభాపేక్ష లేని సంస్థలు ఆర్గనైజేషన్లు, థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖతో కలిసి పనిచేయడం ప్రారంభించా. ఇలా ఇప్పటి వరకూ ఎంతోమంది థాయ్ మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించా. ప్రస్తుతం ఈ మిస్‌వరల్డ్ పోటీల ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన గురించి 'ఓపల్ ఫర్ హర్' స్వరాన్ని ప్రపంచమంతా వినిపించగలిగా.

### ప్రపంచమంతా విస్తరించాలి..

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. థాయ్‌లాండ్‌లోనే ఏటా సుమారు 2 వేల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీటిలో 5 శాతం కంటే తక్కువ కేసులు మాత్రమే తొలి దశలో బయటపడుతుండడం బాధాకరం. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులభంగా దానిని జయించవచ్చు. అందుకే 'ఓపల్ ఫర్ హర్' కేవలం ?థాయ్‌లాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అనుకుంటున్నా. ప్రపంచ నలుమూలల ఉన్న రొమ్ము క్యాన్సర్ బాధితులకు జీవితంపై ఆశలు రేకెత్తించాలని భావిస్తున్నా.

### ఆరోగ్యమే ప్రధానం

క్యాన్సర్ నన్ను, నా ఆలోచనలను ఎంతో మార్చింది. మనిషి జీవితంలో ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఆరోగ్యం ఉంటేనే తన లక్ష్యాలు చేరుకోగలరు, ఏదైనా సాధించగలరు.

# ఏపీలో భారీగా డ్రగ్స్ స్వాధీనం.. వాటి విలువ తెలిస్తే..





విజయవాడ,(ఆరోగ్యజ్యోతి): నగరంలో పోలీసులు ఇవాళ(గురువారం) తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను విజయవాడ పటమట పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు రూ. 2లక్షల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాకు విజయవాడ డీసీపీ సరిత వివరాలు వెల్లడించారు. మాదక ద్రవ్యాల రవాణాపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని విజయవాడ డీసీపీ సరిత వ్యాఖ్యానించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడంతో పాటు డ్రగ్స్ అక్రమ రవాణా నిరోధించే చర్యలు చేపట్టామని అన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రగ్స్ దొరికాయని చెప్పారు. ఈ డ్రగ్స్ తీసుకొవడంతో అతిగా ప్రవర్తిస్తారని అన్నారు. వాహనాల తనిఖీ సమయంలో ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ తీసుకెళ్తున్నట్లు గుర్తించామని తెలిపారు విజయవాడ డీసీపీ సరిత.ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్‌లు నిందితులను విచారణ చేసి అరెస్టు చేశారని విజయవాడ డీసీపీ సరిత వెల్లడించారు. తిరుమలశెట్టి జీవన్ కుమార్, నితీష్ కుమార్, ప్రసాద్‌లను అరెస్టు చేశామని వివరించారు. 33 గ్రాముల డ్రగ్స్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యూనివర్శిటీలో విద్యార్థులకు ఈ డ్రగ్స్ అమ్ముతున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. ఈ తరహా డ్రగ్స్, గంజాయి ఎక్కడ నుంచి తెస్తున్నారు, ఎక్కడకు చేర్చుతున్నారనే అంశాలపై దృష్టి పెట్టామని చెప్పారు. ఈరోజు దొరికిన డ్రగ్స్ కొరియర్‌లో ప్యాక్ చేసి పంపారని అన్నారు. అది పైకి ప్యాకెట్ లాగానే ఉంటుందని.. లోపల చూస్తే డ్రగ్స్ ఉన్నట్లు అర్థం అవుతోందని తెలిపారు. ఇలాంటి డ్రగ్స్ రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి రవాణాపై ఇప్పటికే పీడీ యాక్ట్ కేసులు పెట్టామని అన్నారు. ఇప్పుడు కొత్తగా క్విట్ అండ్ పీటీ యాక్ట్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. కింద నిందితులపై పలు కేసులు నమోదయ్యాయన్నారు. బైక్ దొంగతనాలు చేసి, వాటి ద్వారా గంజాయి రవాణా చేస్తున్నారని తెలిపారు. బైక్‌లు చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు విజయవాడ డీసీపీ సరిత.ఎవరికైనా గంజాయి, డ్రగ్స్ సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు చెప్పాలని విజయవాడ డీసీపీ సరిత కోరారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దు, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ చేరవేసినా కూడా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు ఈవ్‌టీజింగ్ అరికట్టిన విధంగా కాలేజ్‌ల్లో డ్రగ్స్‌ని అరికట్టాలని సూచించారు. ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసుకుని పోలీసులు సమన్వయంతో పని చేయాలని కోరారు. డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా చేయాలన్న ఏపీ ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పోలీసులు పని చేస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా ఈ తరహా అంశాలపై అవగాహన పెంచుకుని పోలీసులకు సహకారం అందించాలని కోరారు. ఈ ముఠా వెనుక కొంతమంది ఉన్నారని.. దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. డీటీడీసీ కొరియర్ ద్వారా ఈ డ్రగ్స్ పార్సిల్ వచ్చింది కాబట్టి.. సిబ్బంది పాత్ర పైనా విచారణ సాగుతోందని వెల్లడించారు. అన్ని విషయాలు ఇప్పుడే పూర్తిగా చెప్పలేమని అన్నారు. ఈ డ్రగ్స్ ఢిల్లీ నుంచి వచ్చింది.. అక్కడ నుంచి ఎవరు పంపుతున్నారు.. ఇక్కడ ఎవరికి చేరవేస్తున్నారనే అంశాలపై విచారణ చేస్తున్నామని విజయవాడ డీసీపీ సరిత పేర్కొన్నారు.

# కొవిడ్‌పై అప్రమత్తం





### జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లు

### ప్రత్యేక వార్డు, వైద్య పరికరాలు సిద్ధం

### ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు

ఒంగోలు,(ఆరోగ్యజ్యోతి): దేశంలో కొవిడ్ వైరస్ మరోసారి విస్తరిస్తున్న నేపథ్యంలో నియంత్రణపై ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లాలో మూడు కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు.అందులోభా గంగా జీజీహెచ్‌లోని అమెరికన్ షెడ్స్‌లో పడకలను ఏర్పాటు చేశారు. అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక ఓపీ వార్డును ఏర్పాటు చేశారు. అక్కడ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్ అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వై.ఏడుకొండలు మాట్లాడుతూ రోజురోజుకూ కొవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ వ్యాప్తిని అరికట్టే దిశగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చేవారికి తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలా అని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఎలాంటి అనుమానిత లక్షణాలు కనిపించినా జీజీహెచ్ వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కొవిడ్ వార్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

# కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం



న్యూఢిల్లీ,(ఆరోగ్యజ్యోతి): మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులతో సమావేశం కావడంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస(డీజీహెచ్‌ఎస్) నిషేధం విధించింది. ఈ మేరకు మే 28న ఆయా ఆస్పత్రుల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వైద్య విధానాలు, ఔషధాలకు సంబంధించిన సమాచారాన్ని వైద్యులతో పంచుకునేందుకు మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఈ-మెయిల్, మరేదైనా డిజిటల్ మీడియాను వినియోగించాలని డీజీహెచ్ఎస్ సూచించింది. ఈ ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఫార్మా సంస్థలకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఇష్టారీతిన వైద్యులతో సమావేశం అవుతున్నారు. ఫలితంగా రోగులకు అందే వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. నిజానికి, కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం విధిస్తూ డీజీహెచ్ఎస్ గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేస్తూ తాజా ఆదేశాలు జారీ చేసింది.

# వెబ్‌సైట్‌లో పేరు లేకుంటే డాక్టర్ కాలేరు

### పేర్లను చెక్ చేసుకోండి

### 2024-25 వైద్య విద్యార్థులకు ఎన్ఎంసీ సూచన

హైదరాబాద్: ఎంబీబీఎస్ 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయో, లేదో వెంటనే తనిఖీ చేసుకోవాలని ఎన్ఎంసీ కోరింది. ఈ మేరకు ఆదివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో కొన్ని సూచనలు, మార్గదర్శకాలు జారీ చేసింది. వెబ్‌సైట్‌లో పేర్లు ఉన్నవాళ్లు మాత్రమే కోర్సు ముగిసిన తర్వాత మెడికల్ ప్రాక్టీస్ చేసుకునేందుకు అర్హత ఉంటుందని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.గతేడాది వివిధ సాంకేతిక కారణాల వల్ల విద్యార్థులు కళాశాలల్లో చేరే తుది గడువును ఎన్ఎంసీ మూడు సార్లు పెంచింది. దీంతో కొన్ని కాలేజీలు విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచలేదని, మరికొన్ని కాలేజీలు అసంపూర్తిగా నమోదు చేశాయని ఎన్ఎంసీ తెలిపింది. వెబ్‌సైట్‌లో వివరాలు లేని వారు తక్షణమే తమ రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడిని సంప్రదించాలని సూచించింది.

# క్షయ రహిత సమాజం దిశగా..

**టీబీ ముక్తి భారత్' పేరుతో ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక**

**రంగంలోకి ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు**

**ఇంటింటికీ వెళ్లి అనుమానితుల కఫం నమూనాల సేకరణ**

**ఆర్టీపీసీఆర్ సెంటర్లలో నిర్ధారణ పరీక్షలు**

**పాజిటివ్ వస్తే ఆరు నెలలపాటు ఉచితంగా మందులు**

**పౌష్టికాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం**

**జిల్లాలో ప్రస్తుతం 1,309 మంది క్షయ బాధితులు**

నర్సీపట్నం,(ఆరోగ్యజ్యోతి): క్షయ వ్యాధిని పారదోలడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో ఈ వ్యాధి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. వంద రోజుల్లో అన్ని ఇళ్లకు వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బందిని రంగంలోకి దించారు.క్షయ వ్యాధి ప్రమాదకరంగా మారింది. క్షయ వ్యాధిగ్రస్థులు దగ్గినప్పుడు వారి నోటి నుంచి వెలువడే తుంపర్ల కారణంగా ఇతరుకు వ్యాపిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో 1,309 మంది క్షయ బాధితులు ఉన్నారు. నర్సీపట్నం, అనకాపల్లి, అచ్యుతాపురం, కోటవురట్ల, ఎలమంచిలి, నక్కపల్లి, చోడవరం, కేజేపురం, కె.కోటపాడుల్లోని ప్రభుత్వ టీబీ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. నర్సీపట్నం ఆర్టీపీసీఆర్ సెంటర్‌లో నెలకు 350 నుంచి 400 మందికి కఫం పరీక్షలు నిర్వహిస్తుంటే వీరిలో 20 నుంచి 25 మందికి పాజిటివ్ వస్తున్నది. క్షయ వ్యాధి నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో క్షయ గురించి ప్రజలకు అవగాహన, ఉపసమనం కలిగించడానికి వైద్య, ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. 'వంద రోజుల' లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను బుధవారం రంగంలోకి దించింది. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి ఎక్కువ రోజులు దగ్గుతో బాధపడుతున్న వారి నుంచి కఫం నమూనాలు సేకరిస్తున్నారు. మద్యం, ధూమపాన అలవాటు వున్నవారు, మధుమేహం, కిడ్నీ సంబంధ వ్యాధి, హెచ్ఐవీతో బాధపడుతున్న వ్యక్తులు, పోషకాహారం లోపతో బాధపడుతున్న వారు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, క్షయకు మందులు వాడి నయమైన వారు, వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయ నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడ మందును ఉచితంగా ఇస్తారు. అంతేకాక క్షయ పోషణ పథకం కింద ప్రతి నెలా రూ. 1,000లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. క్షయ నివారణ మందులను క్రమం తప్పకుండా వాడేలా ఆశా వర్కర్లు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారు. జిల్లాలో ఉన్న 27 ఆర్టీపీసీఆర్ కేంద్రాలలో కఫం పరీక్షలు చేస్తున్నారు.

రెండు వారాలకుపైగా దగ్గు తగ్గక పోవడం, రాత్రి సమయంలో జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం వంటి క్షయ లక్షణాలు అని నర్సీపట్నం క్షయ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి తెలిపారు. వంద రోజుల్లో క్షయ స్క్రీనింగ్, కఫం, ఇతర పరీక్షలు పూర్తి చేసి, అవసరమైన వారికి చికిత్స అందిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి తెలిపారు. క్షయ వ్యాధిని నిర్మూలించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు.

## ఆర్టీసీ తార్నాక ఆస్పత్రికి పర్యావరణ అవార్డు



ఆర్టీసీ తార్నాక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల కేటగిరీలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపులో చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ఆర్టీసీ ఆస్పత్రి బృందానికి అవార్డు అందజేశారు. కాగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో కండక్టర్ల కొరత ఉన్నందున అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్(ఓడీ) విధుల్లో ఉన్న వారు తిరిగి విధుల్లోకి రావాలని బస్ భవన్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.ఓడీ విధుల్లో పనిచేస్తున్న కండక్టర్లతో సహా మొత్తం 829 మంది కండక్టర్ల కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 10 నాటికి వివరాలు అందజేయాలని బస్ భవన్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గర్భంలోని శిశువు మరణించినట్లు చెప్పిన ప్రభుత్వ డాక్టర్లు



**- ప్రైవేట్ హాస్పిటల్‌లో హెల్తీ బేబీకి జన్మనిచ్చిన మహిళ**

రాంచీ, (ఆరోగ్యజ్యోతి): గర్భంలోని శిశువు మరణించినట్లు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు తెలిపారు. కాన్పు చేసేందుకు నిరాకరించారు. ఆ మహిళను ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా ఆరోగ్యంగా ఉన్న పండంటి బాబుకు జన్మనిచ్చింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై దర్యాప్తునకు ఆదేశించారు. జార?ండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 4న చల్కుషా బ్లాక్‌కు చెందిన నిండు గర్భిణీ మనిషా దేవికి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో భర్తతో కలిసి 120 కిలోమీటర్లు ప్రయాణించి షేక్ భిఖారి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు చేరుకున్నది.పురిటి నొప్పులతో బాధపడుతున్న మనిషా దేవిని అడ్మిట్ చేసుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిరాకరించారు. ఆమె హిమోగ్లోబిన్ తక్కువగా ఉందని, గర్భంలోని పిండం ఇప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. అయితే ఇది నమ్మని భర్త వినోద్ తన భార్యను సమీపంలోని సెయింట్ కొలంబా మిషన్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించాడు.మరోవైపు వైద్య పరీక్షలు నిర్వహించిన అక్కడి డాక్టర్లు మనిషా దేవి రిపోర్టులన్నీ బాగానే ఉన్నాయని నిర్ధారించారు. ఆమెకు కాన్పు చేయడంతో పండంటి బాబుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్లు తెలిపారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న హజారీబాగ్ డిప్యూటీ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు కోసం కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించినట్లు మీడియాకు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**బి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ**





నిజామాబాద్, (ఆరోగ్య జ్యోతి)బీ రీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండవలెను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామ మరియు వార్డు పరిధిలో వివిధ శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అదేవిధంగా ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వివిధ శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం మరియు ఆశా కార్యకర్తలు గృహ సందర్శనలో జర సర్వే నిర్వహించి, అనుమానిత కేసులకు ,చికిత్స అందించాలని, నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించేలా గ్రామస్థాయి మరియు మునిసిపల్ అధికారులకు సమాచారం అందించాలని, నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, క్లోరినేషన్ అందుబాటులో లేని ప్రదేశాల్లో క్లోరిన్ మాత్రలను ప్రతి గృహంలో అందజేయాలని, క్లోరినేషన్ తర్వాత లాగ్ బుక్ లో ఎంటర్ చేసి తగు సూచనలు అందజేయాలని, ముఖ్యంగా గ్రామస్థాయిలో మరియు మున్సిపల్ పట్టణ వార్డు స్థాయిలో ప్రజలందరికీ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి పీఎస్సీ పరిధిలో రాపిడ్ రెస్పాన్సి టీం లను ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ గారు మాట్లాడుతూ జిల్లాలో కీటక జనత వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ లాంటివి ప్రబలకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నది వివరించారు. దోమల నియంత్రణపై అందరూ దృష్టి పెట్టి దోమలు పుట్టకుండా దోమలు పుట్టకుండా జాగ్రత్త పడాలని తెలియజేశారు. డెంగ్యూ వ్యాధి గుర్తించిన గృహం చుట్టూ 50 ఇల్లు ల వరకు దోమల మందు స్ప్రే చేయాలని కోరారు. ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఇంకా ఎపిడమాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ గారు మాట్లాడుతూ కుక్క కాటు వల్ల సంభవించే అనర్ధాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చికిత్సను, వ్యాక్సినేషన్ పై వివరించారు. అసంక్రమిక వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ సామ్రాట్ యాదవ్ గారు మాట్లాడుతూ హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్, ఈ సంజీవని ,ప్లాలేటివ్ , వయోవృద్ధులకు అందించే ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశ%శీ%లో డిహెచ్ఈ గన్ పూర్ వెంకటేశ్వర్లు, గోవర్ధన్, వెంకట్ రవి, నిజాంబాద్ డివిజన్లోని అన్నిపీఎస్సీలవైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ

నిజామాబాద్, (ఆరోగ్య జ్యోతి): ప్రస్తుత సమాజంలో ఆరోగ్యానికి కోసం యోగా ఎంతో అవసరమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానసారం జిల్లా సమీకృత కార్యాలయం ప్రాంగణంలో జిల్లా అధికారులకు, ఉద్యోగులకు అందరికి యోగ శిక్షణ మరియు అవగాహన కల్పించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా శిబిరం ఎంతో సంతోషకరంమైందని తెలిపారు. గర్భిణీలకు కూడా యోగ ఆసనాలు వేయించడం వల్ల సుఖ ప్రసాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలంటే మంచి పౌచుగా ఆహారంతో పాటు యోగ తప్పనిసరి అని తెలిపారు. యోగా వల్ల మన శరీరానికి అనేక లాభాలు చేకూరుతాయని తెలిపారు. భారతదేశంలో అనాదిగా వస్తున్నాయోగ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందిందని తెలిపారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో యోగా దినోత్సవం జరుపుకోవడం మన భారతదేశానికి ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. జిల్లాలో 16 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ప్రతి రోజు ఉచిత యోగా శిక్షణ పురుషులకు, మహిళలకు ఉదయం సాయంత్రం నేర్పించ బడుతుందని , నిత్య జీవితంలో యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించి, గర్భిణీ స్త్రీలకు నార్మల్ డెలివరీ అవడానికి తోడ్పడుతుందని చెప్పారు . అనంతరంజిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జె . గంగదాస్ తెలిపారు .డాక్టర్ గంగాదాస్ మాట్లాడుతు ఒక భూమి ఒక ఆరోగ్యము యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ




,ఉద్యోగుల మానసిక ఒత్తిడి నివరణకు యోగ చక్కటి మార్గమని వివరించారు. యోగ వైద్యులు డాక్టర్ తిరుపతి యోగ శిక్ష కులచే సామూహిక యోగ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రాజు ,డాక్టర్ సామ్రాట్ యాదవ్, డిపిమ్ వందన, డాక్టర్ వెంకటేష్, డిహెచ్ఈ లు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ ఆయుష్ పారా మెడికల్ సిబ్బంది పురుషోత్తం, ఉమా ప్రసాద్, స్వాతి, రమేష్, భిక్షపతి , యోగ శిక్షకులు నమ్రత, సంగీత , విజయభాస్కర్, రాజేందర్ మరియు అన్ని జిల్లా కార్యాలయాల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. 21 జూన్ 2025 శని వారం రోజున జరుపుకోబోవు 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని హర్ దిన్ యోగ - హర్ ఘర్ యోగ నినాదం తో ప్రతి ఇంటికి యోగా ని తీసుకెళ్లాలని, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

**ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్**

**ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు**

దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధికి వ్యతిరేకంగా పోరాడేందుకు మలేరియాను నివారించడానికి మరియు ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టటానికి ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు జాతీయ మలేరియా వ్యతిరేక నెలగా వైద్య ఆరోగ్యశాఖ పాటిస్తుందని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ తెలిపారు. శుక్రవారం పలనాడు జిల్లా క్రోసూరు మండలం అనంతవరంలో జాతీయ మలేరియా వ్యతిరేక ప్రదర్శన మరియు మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు మలేరియా వ్యాధిలో ముఖ్యంగా తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, వాంతులు, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలలో వైద్య నిపుణులు ను సంప్రదిస్తే ఉచితంగా పరీక్షలు చేసి వైద్యం అందిస్తారని శాంసన్ తెలిపారు రెండు మూడు రోజులకి మించి జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులు సమీపంలోని ఆరోగ్య కార్యకర్తను గాని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ను గానీ ఆశా కార్యకర్తను గాని సంప్రదించాలన్నారు దోమల నివారణతో మలేరియా ను నివారించవచ్చు అన్నారు దోమల నివారణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి. పరిసరాలను వీలైనంతవరకు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి కాబట్టి నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి ప్రతి శుక్రవారం డ్రైడే విధిగా ప్రజలందరూ



పాటించాలి దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, వెంటిలేటర్లకు నెట్ అమర్చుకోవాలి. దోమతెరలు ఉపయోగించాలి మొక్కల కుండీలు పూల కుండీలలో నీరు ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. కూలర్ల లోని నీటిని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. కూలర్లలో నీళ్లు నిలవ ఉంటే ఆ నీటిలో దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మెడికల్ సీట్లలో స్థానికతపై కౌంటర్ దాఖలు చేయండి.

**తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంనోటీసులు**

**జీవో 33పై విచారణ**

న్యూఢిల్లీ,(ఆరోగ్యజ్యోతి): మెడికల్ సీట్ల కేటాయింపులో స్థానికత అంశంపై సమాధానం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యార్థులు దాఖలు చేసిన ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్లకు(ఐఏ) కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో 33ని తీసుకొచ్చింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు నాలుగు సంవత్సరాలు స్థానికంగా చదవాలని జీవో 33లోని నిబంధన 3 (ఏ)లో స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్ సహా 160 మంది తొలుత హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత గతేడాది సెప్టెంబర్ 5న హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని అభిప్రాయ పడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సెప్టెంబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ తర్వాత మరికొంతమంది విద్యార్థులు తమకు స్థానికత వర్తింపజేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.అన్ని పిటిషన్లను సోమవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసీహలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిశీలించింది. వేసవి సెలవుల తర్వాత దీనిపై విచారణ చేపడతామని ధర్మాసనం తెలపగా, ఈ నెల 14న నీట్ ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని, అందువల్ల వెంటనే విచారణ జరపాలని అభ్యర్థుల తరఫున న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే పుట్టి, అక్కడే చదువుకుని, అన్ని గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ.. కేవలం నాలుగేళ్లు వేరేచోట చదువుకున్నారన్న కారణంతో స్థానికతను వర్తింపజేయకపోవడం సరికాదని వాదనలు వినిపించారు. దీనికి ప్రభుత్వం తరఫున న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో పుట్టి వేరే రాష్ట్రాలు, దేశాలకు వెళ్లి చదువుకుని మళ్లీ అడ్మిషన్ల సమయానికి రాష్ట్రానికి తిరిగి వస్తున్నారని ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు. గతంలో కొంతమందికి కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారని, అలాగే తమకూ అవకాశం కల్పించాలని మరికొంతమంది ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్(ఐఏ)లు దాఖలు చేశారని అభ్యర్థుల తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ పిటిషన్లపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈలోపు అత్యవసరం అనుకుంటే.. సుప్రీంకోర్టు ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించవచ్చని తెలిపింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల,(ఆరోగ్యజ్యోతి): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ అన్నారు. గురువారం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో నంద్యాల జిల్లా సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్యకార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జూన్‌లో నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి రామవిజయరెడ్డి, జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

# కారేపల్లి వ్యాప్తంగా సీజనల్ వ్యాధులపై అవగాహన

కారేపల్లి, (ఆరోగ్యజ్యోతి): ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లితో పాటు అన్ని గ్రామాల్లో గల ఆరోగ్య ఉప కేంద్రాల్లో శుక్రవారం ఫ్రైడే%-% డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత కుండలు, పాత టైర్లు, నీరు నిల్వ ఉన్న తొట్లు, పనికిరాని వస్తువులను ఉంచుకోరాదన్నారు.వాటిల్లో వర్షపు నీరు పడి దోమల లార్వా వృద్ధి చెంది డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రభలుతాయన్నారు. దోమ పుట్టుక, దోమల వల్ల వచ్చే వ్యాధులు, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెబ్‌సైట్‌లో పేరు లేకుంటే డాక్టర్ కాలేరు

## పేర్లను చెక్ చేసుకోండి

## 2024-25 వైద్య విద్యార్థులకు ఎన్ఎంసీ సూచన

హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి): ఎంబీబీఎస్ 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయో, లేదో వెంటనే తనిఖీ చేసుకోవాలని ఎన్ఎంసీ కోరింది. ఈ మేరకు ఆదివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో కొన్ని సూచనలు, మార్గదర్శకాలు జారీ చేసింది. వెబ్‌సైట్‌లో పేర్లు ఉన్నవాళ్లు మాత్రమే కోర్సు ముగిసిన తర్వాత మెడికల్ ప్రాక్టీస్ చేసుకునేందుకు అర్హత ఉంటుందని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.గతేడాది వివిధ సాంకేతిక కారణాల వల్ల విద్యార్థులు కళాశాలల్లో చేరే తుది గడువును ఎన్ఎంసీ మూడు సార్లు పెంచింది. దీంతో కొన్ని కాలేజీలు విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచలేదని, మరికొన్ని కాలేజీలు అసంపూర్తిగా నమోదు చేశాయని ఎన్ఎంసీ తెలిపింది. వెబ్‌సైట్‌లో వివరాలు లేని వారు తక్షణమే తమ రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడిని సంప్రదించాలని సూచించింది.

# తాను చనిపోతూ.. మరికొందరికి..

## - బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానం

హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి): ఓ వ్యక్తి తాను మరణిస్తూ అవయవదానంతో మరికొందరికి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్ ఖాన్‌పేట శివాజీనగర్‌కు చెందిన గూడ పార్థసారథి(39) ప్రైవేట్ ఉద్యోగి. జూన్ 1వ తేదీన బైక్‌పై వెళ్తుండగా జిన్నారం వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుబుంబసభ్యులు అతడిని హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఈనెల 3వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు.అయవయదానంపై జీవన్‌దాన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. పార్థసారథి భార్య మమత అందుకు అంగీకరించారు. పార్థసారథి లివర్, కిడ్నీలు, కార్నియాలు సేకరించిన వైద్యులు కొందరికి అమర్చి ప్రాణదానం చేశారు. జీవన్ ప్రోగ్రాం ద్వారా 2025 జనవరి నుంచి జూన్ 4 వరకు అవయవ దానం ద్వారా బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి 89 డొనేషన్లను స్వీకరించినట్టు జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ శ్రీభూషణ్‌రాజు తెలిపారు.

# వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలకు రంగం సిద్ధం.

ఏలూరు,(ఆరోగ్యజ్యోతి): ఏలూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖలో సాధారణ బదిలీలు భారీగానే జరగనున్నాయి. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వైద్యాధికారులు, అన్ని కేడర్ల సిబ్బందిని తప్పనిసరి (కంపల్సరీ)బదిలీ కింద స్థానచలనం కలిగించనున్నారు. పీహెచ్‌సీల్లో ఐదేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న 11 మంది మెడికల్ ఆఫీసర్లు, ఐదుగురు సీనియర్ అసిస్టెం ట్లకు తప్పనిసరి బదిలీ ఉంటుంది. వీరితోపాటు ఉమ్మడి జిల్లా (48 మండలాలు) పీహెచ్‌సీల్లో దీర్ఘకాలంగా పని చేస్తున్న 190 మంది రెగ్యులర్ ఏఎన్ఎంలకు స్థానచల నం తప్పనిసరి. డీఎంహెచ్‌వో కార్యాలయం పరిపాలనా విభాగంలో మూడేళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ ఖాయం. వీరందరి వెకెన్సీలను బదిలీల వెబ్‌ఆప్షన్లలో చేర్చారు. మిగతా వారంతా రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ల కింద దరఖాస్తు చేసుకోవ చ్చు. కాగా ఏడేళ్లకు పైగా జిల్లా కేంద్రంలో వివిధ కేడర్ల లో పనిచేసిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ నాగేశ్వరరావుకు నిబంధనల మేరకు బదిలీ ఖాయమైంది. ఆయన స్థానంలో భీమవరంలో డీఐవోగా పనిచేస్తోన్న డాక్టర్ డి.సు?ధాలక్ష్మి స్పౌజ్ కోటాలో జిల్లాకు బదిలీపై నియమితులయ్యే అవకాశం ఉంది. డాక్టర్ నాగే శ్వరరావు కె.ఆర్.పురం డిప్యూటీ డీఎం హెచ్‌వోగా బదిలీ అవుతారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు స్టేట్ మెడి కల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పీహెచ్‌సీల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇటీవల జరిగిన నియామకాల్లో కొత్తగా మెడికల్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు పొందిన వారికి మంగళవారం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జిల్లా కేంద్రానికి చేరువగా వున్న వెకెన్సీలను కేటాయించ డంపై ఇన్‌సర్వీసు వైద్యాధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందుగా సీనియర్లకు కౌన్సెలింగ్ ద్వారా కేటాయించి ఉంటే బాగుండేదని పెదవి విరుస్తున్నారు.

## 5,000 దాటిన

# కొవిడ్ కేసులు.. ఆరోగ్య శాఖ ఏమి చెప్పిందంటే

న్యూఢిల్లీ, (ఆరోగ్యజ్యోతి): దేశంలో కొవిడ్ -19 కేసుల సంఖ్య 5,000 దాటిందని, కేరళపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు తెలిపింది. ఒకే రోజులో సుమారు 500 కేసులు పెరగడంతో మొత్తం కేసుల సంఖ్య 5,364కు చేరినట్టు వెల్లడించింది. గత 24 గంటల్లో నలుగురు మృతిచెందినట్టు పేర్కొంది.ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, అత్యధికంగా కేరళలో 1,679 కేసులు నమోదు కాగా, ఆ తర్వాత స్థానంలో గుజరాత్ (615), పశ్చిమబెంగాల్ (596), ఢిల్లీ (592) ఉన్నాయి. గత 24 గంటల్లో కేరళలో ఇద్దరు మరణించగా.. కర్ణాటక, పంజాబ్‌లలో ఒకరి చొప్పున మృతిచెందారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలూ ఆక్సిజన్, ఐసొలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది. చాలా కేసుల్లో తీవ్రత చాలా తక్కువగానే ఉందని, ఇళ్లలో జాగ్రత్తలు తీసుకుని తగ్గించుకోవచ్చని తెలిపింది. అయితే కేసులు పెరిగితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరింది.కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఫెసిలిటీ-లెవల్ ప్రిపేర్డ్‌నెస్ కోసం కేంద్రం మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి 4,727 కేసులు రిపోర్ట్ కాగా, 55 మరణాలు సంభవించినట్టు అధికారులు ధ్రువీకరించారు. మే 22 నుంచి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 257గా ఉంది. కొవిడ్ పరిస్థితి, సన్నద్ధత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో జూన్ 2, 3 తేదీల్లో డీజీహెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ సునీత శర్మ అధ్యక్షత సాంకేతిక సమీక్షా సమావేశం జరిగింది. డిజాస్టర్ మేనేజిమెంట్ సెల్, ఈఎంఆర్ సెల్, ఎన్సీడీసీ, ఐసీఎంఆర్, ఐడీఎస్‌పీ, ఢిల్లీ సెంట్రల్ గవర్నమెంట్ ఆసుపత్రుల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గాజాలో ఆకలి సంక్షోభం



## 77 ట్రక్కులను వేలాది మంది అడ్డుకొని

గాజా : గాజాలో ఆకలి కేకలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. ఈ క్రమంలో అక్కడి గోదాములపైనా దాడులు చేసి ఆహార పదార్థాలను తీసుకెళ్తున్న ఘటనలు తరచూ అక్కడ కనిపిస్తున్నాయి. తాజాగా గాజాలోకి ఆహార పదార్థాలతో వెళ్తున్న అనేక ట్రక్కులను వేలాది మంది పాలస్తీనీయన్లు అడ్డుకున్నారు. ఆ ట్రక్కులు గమ్యస్థానాలు చేరకముందే అందులోని ఆహార పదార్థాలను స్థానికులు తీసుకెళ్లినట్టు ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం(డబ్ల్యూఎఫ్‌పీ) వెల్లడించింది."గాజాలోకి శుక్రవారం నుంచి శనివారంఉదయం వరకు 77 ట్రక్కులను డబ్ల్యూఎఫ్‌పీ తీసుకువచ్చింది. అయితే, ఆహార పదార్థాలతో వెళ్తున్న ఆ ట్రక్కులను మార్గమధ్యలోనే అడ్డుకున్నారు. దాదాపు 80 రోజుల పాటు సాయం నిలిచిపోవడంతో వేలాది మంది ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో ఆ వాహనాలను ముందుకు వెళ్లనిచ్చేందుకు వాళ్లు సిద్ధంగా లేరు" అని డబ్ల్యూఎఫ్‌పీ పేర్కొంది.కొన్ని రోజులుగా ఈ సాయాన్ని పంపించేందుకు ఇజ్రాయిల్ అనుమతించినప్పటికీ.. తగినంత ఆహారం ఇంకా అందుబాటులో లేదని డబ్ల్యూఎఫ్‌పీ అభిప్రాయపడింది. అక్కడ ఆకలి భయం ఎక్కువగా ఉందని, వారి ఆందోళనలను తగ్గించాలంటే మరింత సాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే, ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే వేగంగా అనుమతులు ఇవ్వడంతోపాటు వీటిని తరలించే కాన్వారు కూడా సురక్షితంగా వెళ్లే పరిస్థితులు ఉండాలని తెలిపింది. మరోవైపు, గాజాలోని పాలస్తీనీయన్లకు మానవతా సాయం తరలింపునకు ఇజ్రాయిల్ పరిమితంగానే అనుమతిస్తోంది. దీంతో ఇటీవల 121 ట్రక్కుల్లో ఆహార పదార్థాలు గాజాలోకి ప్రవేశించాయి. అయితే, తీవ్ర ఆకలి సంక్షోభం ఎదుర్కొంటున్న గాజావాసులకు ఇవి అంతగా సరిపోవడం లేదు. దీంతో ఆహార పదార్థాల గోదాముపై దాడులుచేసి.. గోధుమపిండి, ఇతర ఆహార పదార్థాలున్న పెట్టెలను లూటీ చేసినట్టు తెలుస్తోంది.

# వ్యక్తి మృతదేహాన్ని పొరపాటుగా బీహార్ తరలింపు.

## - తర్వాత ఏం జరిగిదంటే?




చెన్నై, (ఆరోగ్యజ్యోతి): కూలీలైన ఇద్దరు వ్యక్తులు మరణించారు. అయితే వారి మృతదేహాలు తారుమారయ్యాయి. స్థానిక వ్యక్తి మృతదేహాన్ని బీహార్‌కు తరలించారు. పొరపాటును గుర్తించి వెనక్కి రప్పించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై దర్యాప్తునకు ఆదేశించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తిరుత్తణి సమీపంలోని గ్రామానికి చెందిన 60 ఏళ్లకుపైబడిన రాజేంద్రన్ వ్యవసాయ కూలీ. ఆత్మహత్యకు పాల్పడటంతో అతడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తిరువళ్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కాగా, బీహార్‌కు చెందిన 55 ఏళ్ల మనోజ్ మాంచి గత నెలలో పని కోసం తమిళనాడు వచ్చాడు. కూలీ పని చేస్తున్న అతడు అనారోగ్యంతో తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడు. అయితే మార్చురీ సిబ్బంది పొరపాటుపడ్డారు. మనోజ్ మృతదేహానికి బదులు రాజేంద్రన్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో బీహార్‌కు పంపారు.మరోవైపు రాజేంద్రన్ మృతదేహం కనిపించకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. పొరపాటున బీహార్‌కు పంపినట్లు తెలుసుకుని నిరసన చేపట్టారు. దీంతో తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సుమారు 800 కిలోమీటర్లు ప్రయాణించిన అంబులెన్స్‌ను వెనక్కి రప్పించారు.కాగా, గురువారం తిరువళ్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు చేరుకున్న రాజేంద్రన్ మృతదేహాన్ని అతడి కుటుంబానికి అప్పగించారు. చివరకు మనోజ్ మృతదేహాన్ని అతడి కుటుంబం గుర్తించిన తర్వాత బీహార్‌కు పంపారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరుగకుండా ఈ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అధికారి తెలిపారు.

# కొవిడ్‌ను కట్టడి చేసేలా



## జిల్లాలో తొలి కేసు నమోదుతో అప్రమత్తమైన వైద్యాధికారులు

## రుయా, స్విమ్స్‌లో పరీక్షా కేంద్రాలు, ఐసీయూ పడకలు సిద్ధం

తిరుపతి,(ఆరోగ్యజ్యోతి): జిల్లాలో తొలి కొవిడ్ కేసు నమోదుతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ వ్యాప్తి చెందినా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు కొత్తగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లలో కొవిడ్ వ్యాపిస్తున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు కేసులు రాగా.. అందులో జిల్లాలో పది నెలల చిన్నారి ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై కొవిడ్ కట్టడి దిశగా సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా స్విమ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డులో ఆరు వెంటిలేటర్ పడకలతోపాటు మరో పది ఆక్సిజన్ పడకలను సిద్ధం చేశారు. 22 టన్నుల సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంటు స్విమ్స్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది రాదని వైద్యాధికారులు చెప్పారు. ఆర్టీపీసీఆర్, రాపిడ్ కిట్లు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక, రుయాస్పత్రిలోని ప్రత్యేక కొవిడ్ వార్డులో 40 ఐసీయూ పడకలను అధికారులు సిద్ధం చేశారు. మూడు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రసూతి ఆస్పత్రిలోనూ గర్భిణుల కోసం ప్రత్యేక కొవిడ్ వార్డును సిద్ధం చేయడంతో పాటు సిబ్బందినీ నియమించారు. అలాగే 3కేఎల్, 6కేఎల్ సామర్థ్యం కలిగిన రెండు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ ఏ దశలో వచ్చినా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు.పీహెచ్‌సీల్లోనూ రాపిడ్ పరీక్షలుస్విమ్స్, రుయాస్పత్రిలో కొవిడ్ పరీక్ష కేంద్రాలున్నా అవసరాన్ని బట్టి పీహెచ్‌సీల్లో కూడా రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రజలూ కొవిడ్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పాం. ఏ వేరియంట్‌లో కొవిడ్ వచ్చినా ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే మొదట్లోనే కొవిడ్‌ను పూర్తిగా కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

# ఆరు ఆస్పత్రులకు సీటీ స్కాన్ మిషన్లు..

## - రూ.27 కోట్లతో ఏర్పాటుకు మంత్రి సత్యకుమార్ ఆమోదం

## - రూ.17 కోట్లతో మూడు ఆస్పత్రులకు క్యాథ్‌ల్యాబ్‌లు

అమరావతి,(ఆరోగ్యజ్యోతి): ప్రభుత్వ సర్వజనాస్పత్రుల్లో (జీజీహెచ్) రోగ నిర్ధారణ పరీక్షల సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా జీజీహెచ్‌ల్లో సీటీ స్కాన్లు, క్యాథ్‌ల్యాబ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జీజీహెచ్‌ల్లో సీటీ స్కాన్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖలోని ప్రభుత్వ చెస్ట్ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఆస్పత్రిలో తొలిసారిగా సీటీస్కాన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.27 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి, నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని 18జీజీహెచ్‌ల్లో 21 సీటీస్కాన్ పరికరాలు ద్వారా రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. తాజాగా శ్రీకాకుళం, నెల్లూరు, తిరుపతి జీజీహెచ్‌ల్లో గుండె పరీక్షలు చేసే క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం తో ఏర్పాటయ్యే ఈ పరికరాల కొనుగోలుకు దాదాపు రూ.17కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల విడుదలకు మంత్రి ఆమోదం తెలిపారు. ప్రస్తు తం విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూ లు, కడప, అనంతపురం జీజీహెచ్‌ల్లో క్యాథ్‌ల్యాబ్‌ల ద్వారా యాంజియోగ్రామ్, స్టెంట్ల ఏర్పాటు సేవలందిస్తున్నారు.

## ఆ జీఎస్టీ శ్లాబ్ విషయంలో

## కేంద్రం కీలక నిర్ణయం.. ఆ వస్తువల ధరల తగ్గింపు

మార్కెటింగ్ రంగంలోని వారికి జీఎస్టీ అంటే పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. ముఖ్యంగా వివిధ రకాల పన్నులన్నింటినీ ఒకే రకమైన పన్ను విధానంలోకి తీసుకొచ్చి వేసే పన్నును జీఎస్టీ అంటారు. దేశంలో విక్రయించే వివిధ వస్తువుల వివిధ శాతాలతో జీఎస్టీ విధిస్తారు. అయితే 12 శాతం శ్లాబ్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్టీలో 12 శాతం పన్ను స్లాబ్‌ను తొలగించే ప్రణాళికను జీఎస్టీ కౌన్సిల్ త్వరలో పరిశీలించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ శ్లాబ్ నాలుగు నుంచి మూడుకు తగ్గించవచ్చని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు జూన్-చివరిలో లేదా జూలైలో కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో 12 శాతం శ్లాబ్ గురించి జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన కౌన్సిల్ ఆదాయ తటస్థతను కొనసాగిస్తూ 12 శాతం స్లాబ్‌ను తొలగించడం ద్వారా రేట్లను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



# ఫార్మసీ ఆఫీసర్ ల సంబరాలు

అదిలాబాద్,(ఆరోగ్య జ్యోతి): ప్రభుత్వం ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా గుర్తించినందుకు గాను ఫార్మసీ ఆఫీసర్ల ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ నీ ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించడంతోపాటు ఫార్మసీ ఆఫీసర్గా ప్రభుత్వం గుర్తించినందుకు గాను వారు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా గుర్తించడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగానికి కీలక పాత్ర వహించేది ఫార్మసీ ఆఫీసర్ లేనని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వైద్యులు రోగిని అన్ని రకాలుగా పరీక్షించిన తర్వాత మందులు మాత్రమే రాస్తారని ఆ మందులను ఫార్మసిస్టులు మాత్రమే ఇచ్చి ఏ డోస్ ఎలా వాడాలో అన్ని వివరంగా రోగులకు చెప్తారని అందుకు వైద్య ఆరోగ్య శాఖ లో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాధన, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వైసి శ్రీనివాస్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్టపల్లి వార్, ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టల్, ప్రధాన కార్యదర్శి శివాజీ, శ్రీకాంత్, మహేందర్, రవీందర్, కార్యాలయ సూపరింటెంట్ గోపి, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి , సురేఖ , వరలక్ష్మి, చింతామణి మరియు ఇతర ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## బంగారం బాటలో వెండి..రికార్డు స్థాయిలోధరల పెరుగుదల

భారతదేశంలో బంగారానికి ఎంత ప్రాముఖ్యం ఉంటుందో? వెండికి కూడా అంతే ప్రాముఖ్యం ఉంటుంది. ముఖ్యంగా పూజాసామగ్రికి చాలా మంది వెండిని కొనుగోలు చేస్తూ ఉంటారు. అయితే వెండి కూడా పెట్టుబడి కింద చూడాలని నిపుణులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా వెండి ధర కూడా బంగారం మాదిరి కొత్త రికార్డులను సృష్టిస్తుంది.